(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY




తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 248 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 18-06 - 2026 పేజీలు : 6 Digital Edition

## దేశానికి రోల్ మోడల్‌గా రాష్ట్రాన్ని

# తీర్చిదిద్దుతం



బడ్జెట్‌లో 8.5 శాతం కేటాయిస్తున్నాం
ప్రభుత్వ పాఠశాలలపై నేటికీ తల్లిదండ్రుల్లో సందేహాలు
వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
నాణ్యమైన విద్యతోనే అసమానతలు దూరం
కులాల అడ్డుగోడలు కూల్చేందుకు అన్ని వర్గాల
విద్యార్థులకు కలిపి అంతర్జాతీయ స్థాయి స్కూళ్లు
క్రీడలకు ప్రోత్సాహం, ఉద్యోగ నైపుణ్యాల శిక్షణ: సీఎం
ఆరుట్లలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ప్రారంభం

రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి:


తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడలు, రంగుల గోడల్లో లేదనీ, తరగతి గదుల్లోనే ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపించడంలో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. 2లో



## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ ట్రంప్ కీలక హామీ

భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ

భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2లో



## హైదరాబాద్‌లో టెస్లా సందడి.. ప్రారంభమైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్‌లో ప్రారంభమైన టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
హైటెక్ సిటీలోని నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు
లేటెస్ట్ మోడల్ వై కార్ల ప్రదర్శన
భారత్‌లో టెస్లాకు ఇది ఐదో ఎక్స్‌పీరియన్స్ సెంటర్
బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో సర్వీస్ సెంటర్ కూడా ఏర్పాటు




## నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు.. రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా ఆంక్షలు విధిస్తూ కేంద్రం నిర్ణయం
ఇది దొంగను వదిలి బాధితుడికి తాళం వేయడమేనన్న రాహుల్ గాంధీ
చీటింగ్ మాఫియాను అరికట్టేందుకే ఈ చర్య అని చెబుతున్న ప్రభుత్వం



## కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే...: కవిత సమాధానం ఏమంటే?

కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదన్న కవిత
బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను మూసేశానని వ్యాఖ్య
తన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్న కవిత

తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. 2లో

## మేలు రకాల వరి సాగును ప్రోత్సహించాలి

హైదరాబద్, జూన్ 17):

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మేలు రకాల వరి సాగుకు రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో వ్యవసాయ ఉత్పత్తులు, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగుపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి చర్చించారు. 2లో



## ఆశ చూపి అధికారంలోకి కాంగ్రెస్

హామీలను నెరవేర్చకుండా మోసం
వాటిని ఎండకట్టాలి : బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హుస్నాబాద్‌రూరల్:

ఎన్నికల సమయంలో ఆశలు చూపి అధికారంలోకి



వచ్చిన కాంగ్రెస్.. నేడు ప్రజలను మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 2లో

## కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే...: కవిత సమాధానం ఏమంటే?

కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదన్న కవిత
బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను మూసేశానని వ్యాఖ్య
తన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్న కవిత

తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ద్వారానే సరికొత్త చరిత్రను లిఖిస్తానని ఆమె ఉద్ఘాటించారు.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కవిత, ఒకవేళ కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చారు. "ఖచ్చితంగా ఆ అధ్యాయం ముగిసింది. జీవితంలో కొన్నిసార్లు పేజీలు తిప్పాలి, మరికొన్నిసార్లు పుస్తకాలనే మూసివేయాలి. నేను బీఆర్ఎస్ అనే పుస్తకాన్ని ఎప్పుడో మూసివేశాను" అని ఆమె పేర్కొన్నారు.

గత ఏడాది సెప్టెంబర్‌లో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు.

బీఆర్ఎస్ పాలనలో తనకు అనేక చేదు అనుభవాలు ఎదురయ్యాయని, సామాజిక న్యాయం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు వంటి హామీలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయిందని కవిత విమర్శించారు. ప్రాంతీయ భావజాలం నుంచి బీఆర్ఎస్ వైదొలగడం వల్లే ప్రజలకు దూరమైందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీయే తమ ప్రధాన ప్రత్యర్థి అని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. ఇక ఢిల్లీ మద్యం కేసులో తనపై దిగువ కోర్టులో ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, ఈడీ, సీబీఐ అప్పీళ్ల అంశాన్ని న్యాయవ్యవస్థకే వదిలేస్తున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## మేలు రకాల వరి సాగును ప్రోత్సహించాలి

హైదరాబద్, జూన్ 17):

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మేలు రకాల వరి సాగుకు రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో వ్యవసాయ ఉత్పత్తులు, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగుపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. బీపీటీ–5204, తెలంగాణ సోనా, కేఎన్ఎం–1638, జైశ్రీరామ్, హెచ్ఎంటీ వంటి వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటూ రైతు కమిషన్ సిఫారసు చేసిందని తెలిపారు. ఆయా పంటల సాగు వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుందని భట్టి అన్నారు. కాగా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోళ్లు తగ్గిస్తూ రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతోందని క్యాబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ కమిషన్ వివరించింది.బాయిల్డ్ రైస్‌ను కొనుగోలు చేయడం లేదని తెలిపింది. మరోపక్క, ఖరీఫ్ సన్నద్ధతపై వరుస సమీక్షలు నిర్వహించిన మంత్రి తుమ్మల.. 'కృషి వాస్' ప్రాజెక్టుపైనా సమీక్ష జరిపారు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పంటల్లో వచ్చే చీడపీడలను గుర్తించి, అవి పొలమంతా విస్తరించేలోపే రైతు మొబైల్‌కు ముందస్తు హెచ్చరికలు, వాడాల్సిన పురుగుమందుల సమాచారాన్ని కృషివాస్ వ్యవస్థ అందిస్తుందని వివరించారు. కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో కృషి వాస్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ వేదికపై నుంచే దమ్మపేట మండలం అంకంపాలేనికి చెందిన పెరుమళ్ల వీరభద్రరావుతో తుమ్మల ఫోన్‌లో మాట్లాడారు. కృషివాస్ వల్ల కలిగిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.

## హైదరాబాద్‌లో టెస్లా సందడి.. ప్రారంభమైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్‌లో ప్రారంభమైన టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
హైటెక్ సిటీలోని నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు
లేటెస్ట్ మోడల్ వై కార్ల ప్రదర్శన
భారత్‌లో టెస్లాకు ఇది ఐదో ఎక్స్‌పీరియన్స్ సెంటర్
బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో సర్వీస్ సెంటర్ కూడా ఏర్పాటు

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ టెస్లా, హైదరాబాద్ నగరంలో తన కార్యకలాపాలను లాంఛనంగా ప్రారంభించింది. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో దీనిని ఏర్పాటు చేశారు. దేశంలో టెస్లా ఏర్పాటు చేసిన ఐదో కేంద్రం ఇది కావడం విశేషం. ఈ కేంద్రం ద్వారా వినియోగదారులు టెస్లా వాహనాలను, వాటిలోని అత్యాధునిక సాంకేతికతను మరియు విశిష్టమైన డిజైన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఉంది.

ఈ సెంటర్‌లో టెస్లా తన సరికొత్త 2026 మోడల్ వై లైనప్‌ను ప్రదర్శనకు ఉంచింది. ముఖ్యంగా మోడల్ వై ప్రీమియం రియర్–వీల్ డ్రైవ్, మోడల్ వై లాంగ్ వీల్‌బేస్ (6–సీటర్) వేరియంట్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల వినియోగదారులు టెస్ట్ డ్రైవ్‌లు చేయడంతో పాటు, వాహనాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నిపుణుల ద్వారా తెలుసుకోవచ్చు. కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా, విక్రయాలు, డెలివరీ మరియు సర్వీస్ వంటి సేవలను అందించేందుకు బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలో మరో ప్రత్యేక కేంద్రాన్ని కూడా టెస్లా సిద్ధం చేసింది.

భారత్‌లో తన మార్కెట్‌ను విస్తరించే వ్యూహంలో భాగంగా టెస్లా ఈ కొత్త సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే గురుగ్రామ్, ఢిల్లీ, ముంబై మరియు బెంగళూరు నగరాల్లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ప్రముఖ టెక్నాలజీ హబ్‌గా పేరొందిన హైదరాబాద్‌లో ఈ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా దక్షిణ భారతదేశంలో తమ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలని కంపెనీ ఆకాంక్షిస్తోంది.

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ: ట్రంప్ కీలక హామీ

భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ

భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు.ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు.

ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## నీట్ పరీక్ష కోసం టెలిగ్రామ్‌పై వేటు.. రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

నీట్ రీ–ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
జూన్ 22 వరకు దేశవ్యాప్తంగా ఆంక్షలు విధిస్తూ కేంద్రం నిర్ణయం
ఇది దొంగను వదిలి బాధితుడికి తాళం వేయడమేనన్న రాహుల్ గాంధీ
చీటింగ్ మాఫియాను అరికట్టేందుకే ఈ చర్య అని చెబుతున్న ప్రభుత్వం

నీట్–యూజీ 2026 రీ–ఎగ్జామినేషన్‌ను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలను, చీటింగ్ నెట్ వర్క్‌లను నిరోధించే చర్యల్లో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా తాత్కాలిక ఆంక్షలు విధించింది. జూన్ 21న పరీక్ష జరగనున్న నేపథ్యంలో, జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "దొంగను పట్టుకోవడం చేతకాక, బాధితుడి ఇంటికి తాళం వేసినట్లుంది" అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇదొక కొత్త ఉపాయాన్ని కనిపెట్టిందని ఆయన ఎద్దేవా చేశారు. అసలైన పేపర్ లీక్ మాఫియాను విడిచిపెట్టి, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు తమ నోట్స్, టెస్ట్ సిరీస్‌ల కోసం టెలిగ్రామ్‌పైనే ఆధారపడతారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సమర్థించుకుంది. వ్యవస్థీకృత చీటింగ్ ముఠాలు రీ–టెస్ట్‌లో మోసాలకు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా నిరోధించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్ష పత్రాల భద్రతను పర్యవేక్షించేందుకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సహాయాన్ని కూడా తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

టెలిగ్రామ్ నిషేధంపై ఆ సంస్థ సీఈఓ పావెల్ డ్యూరోవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు చేసే తప్పులకు భారత్‌లోని 15 కోట్ల మంది వినియోగదారులను శిక్షించడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తొలగించినప్పటికీ, ఇప్పటికే మొబైల్స్‌లో యాప్ ఉన్నవారు వీపీఎన్ సాయంతో దీనిని యాక్సెస్ చేస్తున్నారు.

గత మే నెలలో జరిగిన నీట్–యూజీ పరీక్ష పత్రం లీకైనట్లు వచ్చిన ఆరోపణలతో పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే రీ–ఎగ్జామ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. కాగా, ఈ తాత్కాలిక నిషేధంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

## తరగతి గదుల్లో రాష్ట్ర భవిష్యత్

రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడలు, రంగుల గోడల్లో లేదనీ, తరగతి గదుల్లోనే ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపించడంలో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. అంతకుముందు పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సును సీఎం పరిశీలించారు. మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు,ఎమ్మెల్యేలతో కలిసి హెలిప్యాడ్ నుంచి స్కూల్ ప్రాంగణం వరకు ఆయన స్కూల్ బస్సు లోనే ప్రయాణించారు. స్కూల్ ప్రాంగణానికి చేరుకున్న అనంతరం పైలాన్ ఆవిష్కరించి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీతో మాట్లాడారు. 'థాంక్యూ సీఎం– అంటూ తనకు స్వాగతం పలికిన విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను విద్యార్థులకు అంకితం చేస్తున్నామని అన్నారు. ఈ స్కూల్ కేవలం ఆరుట్ల గ్రామానికి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాత్రమే స్ఫూర్తి కాదని, తెలంగాణలోని 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

ఈ స్కూల్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని, ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఉందంటే విద్యా ప్రమాణాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో స్పష్టమవుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అనే ఆలోచన పోవాలన్నారు. ఈ పాఠశా లల్లో చదువుకున్న వారెందరో గొప్ప నాయకులుగా, అధికారులుగా ఎదిగా రని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ప్రభుత్వ బడిలో చదువుకున్నారని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని సీఎం స్థాయికి చేరుకున్నానని తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిసెంబరు 9న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించ నున్నట్టు ప్రకటించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఈక్రమంలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ నగరానికి తీసుకువచ్చి విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్

పాఠశాల ప్రారంభోత్సవంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. కిచెన్‌ను పరిశీలించి, 'నేను మీలా పూరీ చేయగలనా..' అంటూ ముఖ్యమంత్రి పూరీ చేసి, వంట చేసే మహిళలతో సరదాగా మాట్లాడారు. అనంతరం ప్రీ–ప్రైమరీ తరగతి గదులను సందర్శించి చైల్డ్ లెర్నింగ్ యాక్టివిటీని పరిశీలించారు. పాఠశాలలో లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను సందర్శించారు. అలాగే పాఠశాల ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి జామ మొక్కను నాటారు. అనంతరం డ్యాన్స్, మ్యూజిక్ రూమ్‌ను సందర్శించి, అక్కడి యాక్టివిటీస్ గురించి అడిగి తెలుసుకున్నారు. అటు నుంచి ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు వెళ్లి విద్యార్థులతో కాసేపు ఫుట్‌బాల్ ఆడారు.


# ఆశ చూపి అధికారంలోకి కాంగ్రెస్

హామీలను నెరవేర్చకుండా మోసం
వాటిని ఎండకట్టాలి : బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హుస్నాబాద్‌రూరల్:ఎన్నికల సమయంలో ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు ప్రజలను మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృతజ్ఞతకు, ఆశకు మధ్య పోటీలో ఆశ చూపిన కాంగ్రెస్ గెలిచిందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాము ప్రజల గొంతుకగా ఉన్నామన్నారు. హుస్నాబాద్‌కు బీఆర్ఎస్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమ తొలినాళ్ల నుంచే ఈ ప్రాంత ప్రజలు పార్టీకి అండగా నిలిచారన్నారు. కేసీఆర్‌కు హుస్నాబాద్‌పై ప్రత్యేక నమ్మకం ఉండేదని, ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇక్కడి నుంచే ప్రారంభించేవారన్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో రైతుబంధు, రైతు బీమా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. తెలంగాణలో బీజేపీ ఊసే లేదన్నారు. తెలంగాణలో అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ మాత్రమేనని.. అందులో ఏ సందేహం లేదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డబుల్ ఓట్లు, చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అసలైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడంలో సహకరించాలని పిలుపునిచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు, రైతు సంక్షేమం, దళితబంధు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల పనితీరుపై తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మి కాంతారావు, బీఆర్ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్.. సక్సెస్ సీక్రెట్ చెప్పిన ఆనంద్ మహీంద్రా



ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్ రికార్డు
స్పేస్‌ఎక్స్ ఐపీఓతో 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరిన సంపద
మస్క్ పట్టుదలే అసలైన విజయమన్న ఆనంద్ మహీంద్రా
టెస్లా కష్టాల్లో ఉన్నప్పుడు మస్క్‌కు మద్దతిచ్చిన వైనం గుర్తు చేసుకున్న మహీంద్రా

ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించి ఎలాన్ మస్క్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయనకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ 'స్పేస్‌ఎక్స్' ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్) విజయవంతం కావడంతో మస్క్ నికర సంపద ఒక ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించింది. ఈ అద్భుత విజయంపై మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ, మస్క్ సాధించిన సంపద కంటే ఆయనలోని పట్టుదలే అసలైన విజయమని ప్రశంసించారు. స్పేస్‌ఎక్స్ ఐపీఓ ద్వారా రికార్డు స్థాయిలో 75 బిలియన్ డాలర్లను సమీకరించింది. దీంతో ఫోర్బ్స్, బ్లూమ్‌బెర్గ్ గణాంకాల ప్రకారం మస్క్ సంపద 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రధానంగా స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీలలో ఆయనకు ఉన్న భారీ వాటాలే ఈ అసాధారణ వృద్ధికి మూలధారమయ్యాయి.

ఈ చారిత్రక ఘట్టంపై భారత ప్రముఖ పారిశ్రామిక్కవేత్త ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ, "ప్రస్తుతం వార్తలన్నీ ట్రిలియన్ డాలర్ల గురించే ఉన్నాయి. అయితే, అసాధ్యమని భావించిన దానిని రేపటి వాస్తవంగా మార్చగలమనే ఆయన నమ్మకమే ఇక్కడి అసలైన కథ" అని పేర్కొన్నారు. 2018లో టెస్లా కంపెనీ ఉత్పత్తి పరంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్న రోజులను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో తాను సోషల్ మీడియా వేదికగా మస్క్‌కు అండగా నిలిచానని, సంక్షోభ సమయాల్లోనే నిజమైన ఆవిష్కర్తల సత్తా బయటపడుతుందని అప్పట్లోనే చెప్పానని వివరించారు. ఆనాడు మస్క్ ప్రదర్శించిన పట్టుదలే తనను ఎంతగానో ఆకట్టుకుందని మహీంద్రా వెల్లడించారు. పునర్వినియోగ రాకెట్లు, స్టార్‌లింక్ ద్వారా ప్రపంచవ్యాప్త ఇంటర్నెట్, అంగారకుడిపై మానవ ఆవాసాల వంటి మస్క్ కలలు ఒకప్పుడు అసాధ్యంగా కనిపించాయి. కానీ, ఆయన నిరంతర కృషితో అవి నేడు వాస్తవరూపం దాల్చుతున్నాయి. మస్క్ చూపిన ఈ అసాధారణ పట్టుదలే ఆయనను నేడు ఈ శిఖరాగ్రానికి చేర్చిందని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## విద్యుత్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్



తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు 1.62 శాతం డీఏ పెంపు
రాష్ట్రవ్యాప్తంగా 70,804 మంది సిబ్బందికి ప్రయోజనం
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి కరువు భత్యాన్ని (డీఏ) 1.62 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70,804 మంది ఉద్యోగులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరాలను వెల్లడించారు.

రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, ఎక్కడా అంతరాయం కలగకుండా నిరంతర సరఫరా కోసం శ్రమిస్తున్న ఉద్యోగుల పనితీరును ప్రభుత్వం గుర్తించిందని భట్టి విక్రమార్క తెలిపారు. టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ వంటి అన్ని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ డీఏ పెంపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. 2035 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్న అంచనాలు నేపథ్యంలో, ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని పెంపొందించడం అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్ సంస్థల సిబ్బందికి కాలానుగుణంగా డీఏ సవరించడం సాధారణ ప్రక్రియలో భాగమేనని అధికారులు వెల్లడించారు.

# పదో తరగతి ప్రతిభావంతులకు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.25,116 లు బహుమతి

## గ్రామ స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.10,116 లు బహుమతి బానోతు జ్యోతి,కొండ



బోనకల్, జూన్ 17 ప్రజావేదిక ప్రతినిధి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. బోనకల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తీర్ణులై మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ. 25,116 నగదు బహుమతి అందజేస్తామని, అలాగే గ్రామస్థాయిలో మొదటి స్థానం సాధిస్తే రూ. 10,116 నగదు బహుమతి ప్రకటించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించి, ఉన్నత ఫలితాలు సాధించేలా ప్రోత్సహించడమే ఈ నిర్ణయం లక్ష్యమని తెలిపారు.

నేటి సమాజంలో విద్య ఎంతో విలువైన ఆస్తి అని, చదువుతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు.


పేదరికాన్ని జయించడానికి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలకు క్రమం తప్పకుండా పంపిస్తూ చదువులో ప్రోత్సహించాలని కోరారు. గ్రామం నుంచి మరింత మంది ప్రతిభావంతులు తయారై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల విజయం గ్రామాభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పోటువెంకటేశ్వర్లు, మరిదు శేషు, మరియు ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆగని వడగాల్పులు.. జూన్ 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

తెలంగాణలో జూన్ 20 వరకు కొనసాగనున్న పొడి వాతావరణం
ఉత్తర, తూర్పు జిల్లాలకు మూడు రోజుల పాటు వడగాల్పుల హెచ్చరిక
సూర్యాపేట జిల్లా మోతేలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
హైదరాబాద్, భద్రాచలం వరకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు
రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు




తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి.

బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏడుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4-5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, ఉత్తర, మధ్య, తూర్పు జిల్లాల్లో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడానికి జూన్ 20-21 వరకు సమయం పట్టవచ్చు. ఈ లోగా పలుచోట్ల సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని, ఆ తర్వాత 2-3 డిగ్రీల మేర తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

# డిజిటల్ మోసాలు రెట్టింపు



న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏటా రికార్డు స్థాయిలో విస్తరిస్తున్నప్పటికీ అదే వేగంతో సైబర్ నేరగాళ్లు కూడా విరుచుకుపడుతున్నారు. అంతర్జాతీయ క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్‌యూనియన్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో డిజిటల్ మోసాల ముప్పు దాదాపు రెట్టింపు స్థాయిలో పొంచి ఉంది. గడిచిన ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన డిజిటల్ లావాదేవీలలో అనుమానాస్పద మోసాల సగటు 3.8 శాతంగా నమోదైతే.. భారత్‌లో ఈ రేటు ఏకంగా 7.1 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వేగవంతమైన వృద్ధిని కనబరుస్తున్న లాజిస్టిక్స్, టెలికాం, మరియు ఇన్సూరెన్స్ రంగాలు ఈ సైబర్ మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారుతున్నాయి. పరిశ్రమల వారీగా ఈ డేటాను పరిశీలిస్తే.. కొరియర్, రవాణా సేవలు అందించే లాజిస్టిక్స్ రంగం 16.3 శాతం అనుమానాస్పద మోసాల రేటుతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో టెలికాం రంగం 14.7 శాతంతో, బీమా రంగం 11.5 శాతంతో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నిర్దిష్ట రంగాలు వెంటవెంటనే జరిగే లావాదేవీలపై, విస్తృతమైన డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడి పనిచేస్తుండటమే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. వినియోగదారుల గుర్తింపును సరిచూసే ప్రక్రియల్లో, అథెంటికేషన్ వ్యవస్థల్లో ఉన్న సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ రంగాల ఖాతాల్లోకి సులభంగా చొరబడుతున్నారు. అయితే అంతర్జాతీయ ట్రెండ్‌తో పోలిస్తే భారత్‌లో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న వ్యూహం పూర్తి భిన్నంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త అకౌంట్లు తెరిచేటప్పుడు మోసాలు ఎక్కువగా జరుగుతుంటే.. భారత్‌లో మాత్రం ఇప్పటికే చలామణిలో ఉన్న వినియోగదారుల ఖాతాల్లోకి లాగిన్ అయ్యే సమయంలోనే గరిష్టంగా 3.9 శాతం మోసాలు జరుగుతున్నాయి. వ్యాపార సంస్థలు, వినియోగదారులు లాగిన్ దశల్లో తమ భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## స్ఫూర్తి ఫౌండేషన్ దాతల సహకారంతో విద్యార్థులకు స్టేషనరీ వితరణ



కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు స్ఫూర్తి ఫౌండేషన్ ధాతల సహకారంతో 6 పాఠశాలలలో ప్రతీ విద్యార్థికి 5 నోటుబుక్స్ చొప్పున వచ్చానాయక్ తండా, కలలవాడు, శాంతినగర్, ఖాన్ ఖాన్ పేట, ఎల్ ఎస్ పి పాఠశాల మరియు జిడిపి పల్లి పాఠశాలకు నోటుబుక్స్ తో పాటు టేబుల్ ను ప్రధానో పాధ్యాయులు శిరీష ఎంఈఓ వజీర్ మియా చేతుల మీదుగా అందించటం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కల్లూరు ఎంఈఓ పత్తిపాటి నీవేధిత,ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మర్రెల వెంకటేశ్వర్లు, ఎస్.కె ముజీమ్, దేవేందర్ మరియు దామాల దయాకర్ రావు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని అదనపు కలెక్టర్ వినతిపత్రం అందజేత.



**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 17.**

కొత్తపేట గ్రామపంచాయతీ ధర్మాపురం రెవిన్యూ పరిధిలోని అర్హులైన గిరిజనేతర కుటుంబాలకు భూ పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ కలెక్టర్ తో మాట్లాడుతూ గ్రామ పరిధిలో అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 80 గిరిజనేతర కుటుంబాలకు ఇప్పటివరకు భూ హక్కుల పత్రాలు మంజూరు కాలేదని,అర్హులైన ప్రతి గిరిజనేతర కుటుంబానికి చట్టబద్ధంగా పట్టాలు మంజూరు చేసి,ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన అదనపు కలెక్టర్ సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ విషయమై సంబంధిత అధికారులతో పాటు ఆర్డీవోతో మాట్లాడి అతి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు గట్టు శ్రీనివాస్,చింతనూరి భాస్కర్,పెనుగొండ పుల్లయ్య,సుంకార రామకృష్ణ,దేవినేని రాము,చల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అనుమతి లేకుండా టేకు చెట్ల నరికివేత.



**-కలప స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు.**

**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 17.**

బయ్యారం మండలం సింగారం ఎంపి యుపిఎస్ పాఠశాలనందు ప్రధానోపాధ్యాయుడు శంకర్ సంబంధిత అధికారుల అనుమతి లేకుండా టేకు చెట్లను నరికి కార్పెంటర్ ఇంటికి తరలించారు.ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో బయ్యారం ఫారెస్ట్ రేంజర్ రవి కిరణ్ కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవి శాఖ అధికారులు పాఠశాలలో టేకు చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించి పాఠశాల హెచ్ఎం ను విచారించారు.విచారణ అనంతరం గంధంపల్లి గ్రామంలో కార్పెంటర్ ఇంట్లో నిలువ ఉంచిన టేకు కలపను సీజ్ చేసి డిపోకు తరలించనున్నట్లు డిఆర్ఓ రమాదేవి తెలిపారు.డిఆర్ఓ వెంట బీట్ అధికారి తార ఉన్నారు.

## చింతకాని నూతన ఎస్ఐ నరేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు.

**చింతకాని జూన్ 17 ప్రజా వేదిక ప్రతినిధి.**

చింతకాని పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నరేష్ ను చింతకాని ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువై శాంతి భద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. చింతకాని మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా మరియు పోలీసు శాఖల మధ్య సమన్వయం కొనసాగాలని పేర్కొన్నారు.ఎస్సై నరేష్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టబద్ధమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని, ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చింతకాని ప్రెస్ క్లబ్ సభ్యులు.....ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ మల్లేశ్వరి, ప్రజా దర్బార్ గడ్డం విజయ్, అంబటి శాంతయ్య శెట్టి సురేష్ ఆర్గాన్ న్యూస్ రామారావు,



కోటేశ్వరరావు సి కె న్యూస్ పిచ్చయ్య,గద్దర్ న్యూస్ కరుణాకర్,రణధీర్, టైమ్స్ ఆఫ్ వార్తజొన్నలగడ్డ సందీప్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల నివారణకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

**కల్లూరు జూన్ 17 ప్రజా వేదిక న్యూస్ :**

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి, చైర్మన్ దారావత్ మోహన్ మరియు 17వ వార్డు కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో ప్రత్యేక శానిటేషన్ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇటీవల గత కాలంలో డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలను గుర్తించి, ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రజల్లో ప్రబల కుండా ఉండేందుకు ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టబ డింది.ఈ కార్యక్రమం లో భాగంగా కాలనీలో పేరుకు పోయిన చెత్తను తొలగిం చడం, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, దోమల వ్యాప్తి నివారణకు యాంటీ లార్వా మందుల పిచికారీ నిర్వహిం చడం, మురుగు కాలువలను శుభ్రపరచడం వంటి చర్యలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి



పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవ డం, నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టడం లో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధుల నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.అలాగేప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి వార్డులో అవసర మైన చోట్ల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు నిరంతరం నిర్వహిం చ బడతాయని,ప్రజలు కూడా మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, ఉబ్బన రాంబాబు ,శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్,మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు,వార్డు సిబ్బంది మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం గ్రామంలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం.






**-మండల వ్యవసాయ అధికారి కే.రాజు.**

**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 17.**

కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు జిల్లా వ్యవసాయ అధికారిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం బయ్యారం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐపీఎంసీ ఇంచార్జి వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రారంభించిన కేతీ బచావో అభియాన్ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి మట్టిపరీక్ష,పంట మార్పిడి చేసి రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడాలన్నారు.హెున్నప్ప ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విత్తన శుద్ధి ఉపయోగాలు గురించి చెప్పి డెమో చూపించారు.అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్ శంకర్ మాట్లాడుతూ పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు,కొనేటప్పుడు,వాడిన తర్వాత పాటించ వలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.మండల వ్యవసాయ అధికారి కే.రాజు,పి.రమేష్,ఏఈఓలు పాల్గొని రైతులు రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడే జనుము,జీలుగ వేసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొర్రా కృష్ణ పాల్గొని రైతులకు మార్గనిర్దేశం చేశారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ చేసిన సర్పంచ్.

**-బొల్లి జయంతి వెంకటకృష్ణ.**

**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 17.**

బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ పాఠశాలలో జాయిన్ అయినా విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయడంతో పాటు విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం అందించే పుస్తకాలను సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ చేతిలో మీద పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కవిత,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సరస్వతి,ఉపాధ్యాయులు, రవీందర్,పద్మ,అంగన్వాడి టీచర్ ముకుందా,అంగన్వాడి ఆయ బుల్లి, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసిన ఎంపిడివో.





బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,జూన్ 17.

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బయ్యారం మండలం లక్ష్మీనరసింహపురం ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో దీపిక సందర్శించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పానుగోతు వెంకన్న ఆధ్వర్యంలో ఎంపీడీవో దీపిక చేతుల మీదుగా ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్ ఎంపీడీవో చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అందించారు.అనంతరం పాఠశాలను సందర్శించి ప్రహరీ గోడ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని పిల్లలకు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేదే నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న బెనిఫిట్స్ గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్,లక్ష్మీ,ఉప్పలయ్య,పంచాయతీ సెక్రటరీ,అంగన్వాడి టీచర్స్ సునీత, విజయ,తదితరులు పాల్గొన్నారు.

## పాతర్లపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ....




ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వొబినబోయిన లక్ష్మి అచ్చయ్య....

చింతకాని జూన్ 17 ప్రజా వేదిక ప్రతినిధి.

మండల పరిధిలో ఉన్న పాతర్లపాడు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాడు గ్రామ సర్పంచ్ వొబినబోయిన లక్ష్మి అచ్చయ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని అన్నారు.పుస్తకాలు జ్ఞానానికి ద్వారాలని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి, వారి విద్యాభివృద్ధికి గ్రామ పంచాయతీ తరపున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దారెల్లి సురేష్ ,పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ గేమ ల ద్వారా మీకు మరిన్ని డబ్బులు వస్తాయని ఆశ చూపుతూ సైబర్ నేరగాండ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి ఎస్సై పి సంతోష్,..

నేలకొండపల్లి జూన్ 17 ప్రజావేదిక న్యూస్

గువ్వల గూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి తేదీ 23-05-20 2026న ఇన్స్టాగ్రామ్ చూస్తుండగా ఆన్లైన్ గేమ్స్ ఆడితే మీకు డబ్బులు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తుల నుండి వివిధ ఫోన్ నెంబర్లనుండి అతనికి ఫోన్ చేసి ఆన్లైన్లో గేమ్స్ ఆడటం వల్ల డబ్బులు వస్తాయని చెప్పగా, అతనికి ఆడటం రాదని అని చెప్పిన మీరు వెంటనే ఆడకపోయినా మీ బదులు మేము ఆడుతామని నమ్మించి కొంత డబ్బులు మీరు చెల్లించినట్లయితే మీ తరఫున మేము గేమ్స్ ఆడి మీకు ఎక్కువ డబ్బులు వచ్చేలా చేస్తామని గుర్తుతెలియని వ్యక్తులు / సైబర్ నేరగాళ్లు చెప్పగా వారు పంపిన యూపీఐ ఐడి లకు ఫిర్యాదిదారుడి రెండు ఎకౌంట్లో నుండి మరియు అతని భార్య ఎకౌంటు నుండి మొత్తం 12 దఫాలుగా 42048 రూపాయలు చెల్లించినాడని తరువాత ఫిర్యాదుదారుడు గుర్తుతెలియని వ్యక్తుల్ని డబ్బులు పంపలేదని అడగగా వారు మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పినారని అప్పుడు తాను మోసపోయానని అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ 1930 కాల్ చేసి కేసు నమోదు చేసి వారి కుటుంబ సభ్యులతో చర్చించి పోలీస్ స్టేషన్ వచ్చి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చెయ్యనైనది,ప్రతి ఒక్కరూ గుర్తుతెలియని వ్యక్తుల/ సైబర్ నేరగాళ్లు నుంచి వచ్చే ఫోన్ కాల్స్ ను పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి తెలియని లింక్స్ ని ఓపెన్ చేయవద్దని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గ్రా. సంతోష్ గారు తెలియజేశారు.

# తిర్లాపురం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం.

## -ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న చింతకాని ఎస్ఐ జి.నరేష్.

చింతకాని జూన్ 17 ప్రజా వేదిక ప్రతినిధి.

చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలోని బుధవారం నాడు గ్రామపంచాయతీ కార్యాలయంలోని వాసన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ఖమ్మం యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకాని ఎస్ఐ జి. నరేష్, తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు హాజరై రిబ్బన్ కట్ చేసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.....పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు అన్నారు. ఈ సందర్భంగా చింతకాని ఎస్ఐ జి నరేష్ మాట్లాడుతూ.... ఈ శిబిరాల ద్వారా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన మందులు ఉచితంగా అందడం వల్ల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు





చేసిన తిర్లాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ప్రత్యేకంగా అభినందించారు.

వాసన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ఖమ్మం క్యాంప్ నిర్వాహకులు పి.వెంకటేష్ మాట్లాడుతూ........

ప్రజల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సమాజ అభివృద్ధికి ఎంతో దోహద పడతాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటి వ్యాధుల నివారణకు, ముందస్తు గుర్తింపునకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాల్లో తిర్లాపురం గ్రామస్తులు 165 మంది పరీక్షలు చేయించుకున్నారు వారిలో 13 మంది డాక్టర్ గారు సలహాలు ఇవ్వడం జరిగింది. 34 మందికి ముందుచూపు తగ్గింది వారికి కళ్ళజోడు అవసరాన్ని డాక్టర్ గారికి తెలియజేశారు. 18 మందికి మెడిసిన్ ద్వారా నియంత్రించుకోవచ్చని తెలియపరిచారు. మా క్యాంపు ఇంతగా సక్సెస్ గా పూర్తి సహకారాలు అందించిన గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియపరిచారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ నాగ సీతారత్నం మాట్లాడుతూ....ఇటువంటి సేవా కార్యక్రమాలకు మా సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, ఇటువంటి కార్యక్రమాలు ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఇటువంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామంలో నిర్వహించినందుకు మా గ్రామ సర్పంచ్ చాపలు మడుగు వీరబాబు గారికి హృదయపూర్వక అభినందనలు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్ఐ జి.నరేష్, తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామ సెక్రెటరీ ఉమారాణి, వార్డ్ సభ్యులు చాపలమడుగు మధు, అయితం విజయ, ఆశ వర్కర్ చాపలమడుగు రాణి, అంగన్వాడి టీచర్ నాగ సీతారత్నం, గ్రామ దీపిక బెజవాడ సావిత్రి, గోగుల నరసింహారావు, బండి సైదులు, రేషన్ డీలర్ బండి యాకోబు, గోదాప్రసాద్, సువర్ణ కంటి నాగేశ్వరావు, గోదా వెంకన్న, మరీదు మధు, మరీదుశీను, మరీదు రామ్ లక్ష్మణ్, ఐతం రమేష్ , గోదరాధమ్మ, సుష్మ, శైలజ, శిరీష, గోదా రామారావు, బల్లి చిన్న వీరయ్య, వాసన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ఖమ్మం నిర్వాకులు వెంకటేష్, రామకృష్ణ ఈశ్వర్, గ్రామ పెద్దలు, యువతి యువకులు, గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోనకల్ గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా నిలబెడతాం

బోనకల్, జూన్ 17 ప్రజావేదిక ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యాచరణలో భాగంగా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని బోనకల్ సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ తెలిపారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పరిశు భ్రత, ఆరోగ్య పరిరక్షణ, ప్రజా బాధ్యతలపై కొంద కీలక సూచనలు చేశారు.గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి కుటుంబం పరిశు భ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, నీరు రోడ్లపైకి చేరి దోమలు, వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు.



నిబంధనలను ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో లేదా కాలువల్లో చెత్త వేస్తే గ్రామ పంచాయతీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. బహిరంగ మలమూత్ర విసర్జన పూర్తిగా మానుకోవాలని, గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా నిలబెట్టడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి పరిశుభ్రతే ప్రధాన ఆధారం అని ఆయన పేర్కొన్నారు.గ్రామ పరిధిలోని వ్యాపారులు తమ వ్యాపార అనుమతి పత్రాలను వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయంలో పునరుద్ధరించుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో అన్ని వ్యాపార సంస్థలు నిబంధనలకు లోబడి పనిచేయాలని కోరారు.

గ్రామాభివృద్ధి అనేది కేవలం అధికారుల బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని బానోతు కొండ అన్నారు. ప్రతి కుటుంబం సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి గ్రామ పంచాయతీకి సహకరిస్తే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన గ్రామంగా బోనకల్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.పరిశుభ్రమైన గ్రామం,ఆరోగ్యవంతమైన సమాజం" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో,మండల ఇరిగేషన్ అధికారి కొండలరావు, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, మండల అధికారులు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు తెల్లాకుల శ్రీనివాసరావు, బిళ్ళ విశ్వనాథం, మండల పరిషత్ మాజీ ఉప అధ్యక్షులు గుగులోతు రమేష్, టేకులపల్లి సాంబయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గం యార్లగడ్డ కుమారి, మరిదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మేర సాహెబ్, జరుపల లావణ్య, తాలూరి జ్యోతి, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, మరియు బదావత్ హుస్సేన్ నిమ్మల రాజశేఖర్, కలవల బాబు, సెల్ పాయింట్ సాయి కృష్ణ, వేమా లలిత, టైగర్ విజయ్, జిడుగు వెంకటేశ్వర్లు, బోడ అంజి, యోగి శ్రీనివాస్, జర్పల శివకృష్ణ, జూపల్లి వెంకటేశ్వర్లు, ధారావతు సాధు, మరియు వ్యాపారస్తు స్థానిక ప్రజలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.